క్లుప్తంగా

ముగిసిన శ్రీ విద్య ఉపాసన తరగతులు



శ్రీవిద్య ఉపాసస తరగతులకు హాజరైన అభ్యాసకులు

సబ్బవరం: ప్రముఖ ఆధ్యాత్మిక క్షేత్రం దేవీపురంలోని సహస్రాక్షి రాజరాజేశ్వరీదేవి పీఠంలో ఈ నెల 16 తేదీ నుంచి నిర్వహించిన శ్రీవిద్య ఉపాసన తరగతులు ముగిశాయని గురుమాత అన్నపూర్ణమ్మ తెలిపారు.ఈ సందర్భంగా శిక్షణలో పాల్గొన్న వారిని అభినందించారు. ఆమె మాట్లాడుతూ గురుపౌర్ణమిని పురస్కరించుకొని ఆదివారం ప్రత్యేక పూజలు,అభిషేకాలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

పారిశుధ్య కార్మికులకు రెయిన్ కోట్ల పంపిణీ



రెయిన్ కోట్లు అందిస్తున్న కార్పొరేటర్ వసంత

పెందుర్తి: జీవీఎంసీ 97వ వార్డు పరిధిలోని పారిశుధ్య కార్మికులకు జీవీఎంసీ అందించిన రెయిన్ కోట్లను కార్పొరేటర్ శానాపతి వసంత శంకర్రావు పంపిణీ చేశారు. చినముషిడివాడలోని జరిగిన కార్యక్రమంలో టీడీపీ నేత శానాపతి శంకర్రావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ రమేష్, సిబ్బంది పాల్గొన్నారు.

వెంకన్నకు ప్రత్యేక పూజలు



పూజలందుకున్న వేంకటేశ్వరస్వామి

పెందుర్తి: స్థానిక వెంకటాద్రిపై శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయాన్నే సుప్రభాత సేవ, ఆరాధన చేసి బాలభోగం నివేదించారు. సహస్ర నామార్చన, రాజభోగం, సర్వ దర్శనాలు జరిగాయి. వెంకన్న సన్నిధిలో భక్తులు తులాభారం నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. భక్తుల కోసం వెంకటాద్రి దిగువ నుంచి ఉచిత రవాణా సదుపాయం కల్పించారు.

వ్యక్తి అదృశ్యం



హనుమాన్

పెందుర్తి: స్థానిక అయ్యప్ప స్వామి దేవాలయం సమీపంలోని జేఎన్ఎన్‌యూఆర్ఎం కాలనీలో నివాసం ఉంటున్న బద్ది హనుమాన్ అనే వ్యక్తి అదృశ్యమైనట్లు పెందుర్తి పోలీసులకు కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేశారు. హెచ్‌సీ బి.అప్పారావు తెలిపిన వివరాలు.. హనుమాన్ ఈ నెల 17 ఉదయం ఇంటి నుంచి బయటకు వెళ్లి రెండు రోజులు గడిచినా ఇంటికి రాలేదు. ఆందోళనకు గురైన కుటుంబ సభ్యులు శనివారం పోలీసులను ఆశ్రయించారు. సీఐ రామకృష్ణ ఆధ్వర్యంలో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు హెచ్‌సీ తెలిపారు.

ఎస్టీ కమిషన్ సభ్యుడికి గిరిజన సంఘాల అభినందన



హుస్సేన్ నాయక్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న నేతలు

ఎంవీపీకాలనీ: జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు జె.హుస్సేన్ నాయక్‌కు గిరిజన సంఘాలు అభినందనలు తెలిపాయి. హుస్సేన్ నాయక్ రెండు రోజులుగా విశాఖ పర్యటనలో ఉన్న విషయం తెలిసిందే. ఇందులో భాగంగా అఖిల భారత గిరిజన సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో పలువురు గిరిజన సంఘాల నాయకులు, సభ్యులు పోర్టు గెస్ట్ హౌస్‌లో శనివారం ఆయనను కలిసి పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా విశాఖ స్టీల్ ప్లాంట్, పోర్టు ట్రస్ట్‌తో పాటు పలు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ సంస్థల ఉద్యోగుల సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ఈ కార్యక్రమంలో అఖిల భారత గిరిజన సంక్షేమ సంఘం నాయకులు పీవీ రమణ, యామిని కుమార్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



గిరిప్రదక్షిణలో డోలు వాయిద్యం



జనంలోకి వెళ్లలేక కొండదిగువన గోడపై కొబ్బరికాయలు కొడుతున్న భక్తులు

దారులన్నీ 'గిరి' వైపే..



భక్తులతో నిండిపోయిన అడవివరం ప్రధాన మార్గం



సింహాచలేశా.. చల్లగ చూడు స్వామీ..

- ఏఎస్ఆర్, అనకాపల్లి, ఎస్. కోట నుంచి పెందుర్తి మీదుగా తరలిన భక్తులు
- పినగాడి, పెందుర్తి కూడళ్లలో రద్దీ
- వేపగుంట వద్ద బారులు తీరిన వాహనాలు, భక్త జనం

సింహాచలం/పెందుర్తి: అల్లూరి సీతారామరాజు జిల్లా, అనకాపల్లి, విజయనగరం ఇలా అన్ని జిల్లాల నుంచి లక్షలాది భక్తజనం పెందుర్తి మీదుగా సింహాచలం గిరి వైపు తరలివచ్చారు. ఆటోలు, ఆర్టీసీ బస్‌లు, బైక్‌లు, కార్లు, ఇతర ప్రైవేటు వాహనాల్లో భక్తులు అప్పన్న సన్నిధికి చేరుకున్నారు. ఏజెన్సీ, అనకాపల్లి జిల్లాల నుంచి ప్రజలు పినగాడి మీదుగా సబ్బవరం–వేపగుంట రోడ్డు మీదుగా వేపగుంట కూడలికి చేరుకున్నారు. అలాగే విజయనగరం జిల్లా ఎస్.కోట వైపు నుంచి వచ్చిన వారు పెందుర్తి కూడలి మీదుగా గిరి వైపు నడిచారు. వేపగుంట కూడలి వద్ద ఉదయం నుంచి కోలాహలం కనిపించింది. వర్షం పడుతున్నా ప్రజలు వెనుకడుగు వేయకుండా అప్పన్న తొలి పావంచాకు చేరారు. పినగాడి, పెందుర్తి కూడళ్ల వద్ద ట్రాఫిక్ రద్దీ కనిపించింది. వేపగుంట కూడలి వద్ద బీఆర్‌టీఎస్ రహదారి మధ్య మార్గంలో మాత్రమే వాహనాలను పంపి..మిగిలిన రెండు మార్గాలను కాలినడకన వచ్చిన భక్తులకు కేటాయించారు. పాత గోశాల కూడలి నుంచి వేపగుంట వరకు వాహనాల పార్కింగ్‌కు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.



కొబ్బరి కాయలు కొట్టడానికి బారులు తీరిన భక్తులు



తొలిపావంచా వద్ద మేడపై నుంచి పర్యవేక్షిస్తున్న సీపీ శంఖబ్రత బాగ్చీ

కోరికలు నెరవేరుతాయి



మేము కాకినాడ నుంచి వచ్చాం. ఉదయం 7.30 గంటలకు గిరి ప్రదక్షిణ ప్రారంభించాం. తిరిగి సాయంత్రం 6 గంటలకేసింహాచలం చేరుకున్నాం. మేము రెండోసారి గిరి ప్రదక్షిణ చేశాం. గతేడాది తొలిసారి చేసినప్పుడు స్వామిని కోరిన కోరిక నెరవేరింది. ఆ నమ్మకంతో రెండో సారి గిరి ప్రదక్షిణకు వచ్చాం. –సాయిపుష్ప, నందిని, కాకినాడ

భగవంతుడు ఉన్నాడని నిదర్శనం



మూడు రోజులుగా వర్షం కురుస్తూనే ఉంది. గిరి ప్రదక్షిణ ఉత్సవం ఎలా జరుగుతుందో...గిరి తిరగగలమా అన్న సందేహం ఉండేది. కానీ భగవంతుడు ఉన్నాడనడానికి నిదర్శనమే వర్షం ఆగిపోవడం. శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి మహిమాన్వితుడు.

– రామరాజ్యం, మాధవధార, విశాఖ

తొలిసారి ప్రదక్షిణ చేస్తున్నాం



మా వూరి నుంచి ఏటా చాలా మంది గిరి ప్రదక్షిణ చేస్తుంటారు. కోరిన కోర్కెలు తీరుతాయని చెబుతారు. మేము కూడా తొలిసారి గిరి ప్రదక్షిణ చేస్తున్నాం. ఇంత జనాన్ని చూస్తుంటే ఆశ్చర్యం కలుగుతోంది. నిజంగా ఇది చాలా గొప్ప ఉత్సవం.

– రేఖ,దీప్తి, లలిత,గంగ,అడ్డురోడ్డు, అనకాపల్లి జిల్లా

ఐదోసారి ప్రదక్షిణ చేస్తున్నా..



నేను ఐదోసారి ప్రదక్షిణ చేస్తున్నాం. మాఊరి నుంచి చాలామంది ఏటా ప్రదక్షిణకు వస్తుంటాం. చాలా గొప్ప మహిమగల వాడు. కుటుంబాన్ని చల్లగా చూస్తాడు. ఆ సింహాద్రినాథుడంటే నాకు ఎంతో భక్తి భావం.

– మంగమ్మ, మక్కువ

ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పని చేద్దాం



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ బాబు



పాల్గొన్న ప్రజా ప్రతినిధులు,పలు శాఖల మండల స్థాయి అధికారులు

- గ్రావెల్, మట్టి తరలింపుపై నిఘా
- ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు

సబ్బవరం: ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పని చేసి మండల ప్రజల ఆకాంక్షలను నెరవేరుద్దామని ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ బాబు అన్నారు.స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో ఎంపీపీ బోకం సూర్యకుమారి అధ్యక్షతన శనివారం నిర్వహించిన మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా రమేష్‌బాబు మాట్లాడుతూ ప్రజా ప్రతినిధులను సమన్వయం చేసుకుంటూ అధికారులు, ఉద్యోగులు బాధ్యతాయుతంగా పని చేయాలన్నారు.ఎన్నికల వరకూ మాత్రమే పార్టీలు.. ఎన్నికల అనంతరం ప్రజలకు మేలు చేసే నిర్ణయాలు తీసుకోవాలన్నారు. కొంతమంది అధికారులు అధికార పార్టీలకు అనుకూలంగా పనిచేయడం సహజంగా జరుగుతుందని.. అంతిమంగా ప్రజలకు నష్టం జరగ కూడదన్నారు. మండల పరిషత్ సర్వసభ్య సమావేశానికి ఆహ్వానితులు మాత్రమే హాజరు కావాలని.. ప్రొటోకాల్ ఉల్లంఘన తావు ఇవ్వవద్దని సూచించారు.

అక్రమాలకు చెక్

రెవెన్యూ అధికారులను పోలీసు అధికారులతో సమన్వయం చేసుకుని అక్రమ గ్రావెల్, మట్టి తవ్వకాలతో పాటు అక్రమ నిర్మాణాలు జరగకుండా అడ్డుకట్ట వేయాలని సూచించారు. రెవెన్యూ సమస్యలు సకాలంలో పరిష్కరించాలని,సమస్యలపై వచ్చేవారిని కార్యాలయం చుట్టూ తిప్పించుకోవద్దన్నారు. ప్రాధ్యానత క్రమంలో మండలంలోని రోడ్ల మరమ్మతులు చేపడతామన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ దాడి ఝాన్సీ లక్ష్మీరాణి, చొక్కాకుల గోవింద్,ఎంపీడీవో రామ్మోహనరావు, ఏవో ఎస్. బాబూరావు తదితరులు పాల్గొన్నారు.

అప్పన్న భక్తుల సేవలో.. స్వచ్ఛంద సంస్థలు



భక్తులకు పొంగలి అందజేస్తున్న ఎస్ఎస్ఆర్ ఫంక్షన్ హాల్ అధినేత బి.వి. కృష్ణారెడ్డి



భక్తులకు బోండా అందజేస్తున్న హైదరాబాద్‌కు చెందిన కందాళ శ్రీనివాస్



అడవివరంలో భక్తులకు పులిహోర అందజేస్తున్న భూలోక యూత్ ఫ్రెండ్స్



గురురాజ సంపత్ వినాయక ఏజెన్సీస్ ఆధ్వర్యంలో..

సింహాచలం: సింహగిరి ప్రదక్షిణకు తరలివచ్చిన భక్తులకు దారి పొడవునా పలు స్వచ్ఛంద సంస్థలు, సంఘాలతో పాటు పలు కుటుంబాల వారు తరించారు. తమకు తోచిన రీతిలో వితరణ చేపట్టారు. పరోక్షంగా అప్పన్న సేవలో మునిగారు. ఆహార పదార్థాలు, పానియాలు, ప్రసాదం,టిఫిన్స్, చాక్లెట్లు, టీ, బిస్కెట్లు విరివిగా అందజేశారు. అడవివరం, పాత అడవివరం నుంచి పైనాపిల్ కాలనీకి వెళ్లే మార్గంలో పెద్ద ఎత్తున భక్తులకు సేవలందించారు.

- పాత గోశాల వద్ద ఎస్ఎస్ఆర్ కల్యాణమండపం అధినేత బి.వి.కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో బోండా, పొంగలి నిర్విరామంగా అందజేశారు.
- హైదరాబాద్‌కి చెందిన కందాల శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఉదయం నుంచి రాత్రి వరకు అల్పాహారం పంపిణీ చేశారు. ఇందుకోసం హైదరాబాద్ నుంచి ప్రత్యేకంగా 100 వంట బృందాన్ని తీసుకొచ్చారు.
- గురురాజ సంపత్ వినాయక ఏజెన్సీస్ ఆధ్వర్యంలో పులిహోర, బిర్యానీ, శనగలు, ఉప్మా, స్వీట్లు అందజేశారు.
- అడవిరం ప్రధాన రహదారి వద్ద భూలోక యూత్ ఫ్రెండ్స్ ఆధ్వర్యంలో పులిహోర పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎర్ర వరహా నరసింహం, యర్ర మణిదీప్, శిడగం రామకృష్ణ, శిడగం సంతోష్‌కుమార్ పాల్గొన్నారు.
- అడవివరంలోని ఎంపీపీ స్కూల్ వద్ద అడవివరం నివాసితులు ఫణిమనోహర్, సతివాడ శంకర్రావు, బున్ని ఆధ్వర్యంలో పులిహోర, గ్లూకోస్ అందజేశారు.
- ప్రకృతి వ్యవసాయదారుల సేవా సంఘం ఆధ్వర్యంలో పులిహోర, సత్యనారాయణస్వామి ప్రసాదం, చక్కెర పొంగళి, శనగలు పంపిణీ చేశారు.



రైతుమిత్ర ఆధ్వర్యంలో పులిహోర పంపిణీ

- మేజర్ డిఫెన్స్ అకాడమీ ఆధ్వర్యంలో పులిహోర అందజేశారు.
- నగరంలోని శ్రీహరిపురానికి చెందిన శ్రీలక్ష్మి క్రేన్స్ ఆధ్వర్యంలో బిర్యానీ, సత్యనారాయణ స్వామి ప్రసాదం అందజేశారు.
- ఉత్తరాంధ్ర నర్సరీ అసోసియేషన్ ఆధ్వర్యంలో పులిహోర పంపిణీ చేశారు.

తగ్గుముఖం పట్టిన వర్షాలు



ముత్యాలమ్మపాలెం తీరంలో వలలను సరిచేసుకొంటున్న మత్స్యకార్మికులు



దిబ్బపాలెంలో పాక్షికంగా దెబ్బతిన్న పూరిల్లు

- పాక్షికంగా దెబ్బతిన్న రెండు పూరిల్లు
- విరామంలోనే మత్స్యకారులు

పరవాడ: తుపాను కారణంగా రెండు రోజులుగా మండలంలో ఎడ తెరిపిలేకుండా కురిసిన వర్షాలు శనివారం తగ్గుముఖం పట్టాయి. అయితే మధ్యాహ్నం నుంచి ఈదురు గాలులు ఉధృతి అధికమైంది. ముత్యాలమ్మపాలెం తీరం అల్లకల్లోలంగా మారింది. తీరం వెంబడి ఈదురుగాలులు జోరుగా వీస్తున్నాయి. కెరటాలు తీరాన్ని బలంగా తాకుతున్నాయి. మత్స్యకారులు నాలుగు రోజులుగా చేపల వేటకు స్వస్తి చెప్పి ఇళ్లకు పరిమితమై వలలను సరిచేసుకుంటున్నారు. ప్రస్తుతం వీస్తున్న ఈదురు గాలులకు భర్నికం గ్రామంలో విద్యుత్ స్తంభం కూలిపోగా దిబ్బపాలెంలో రెండు పూరిల్లు పాక్షికంగా దెబ్బతిన్నాయి. ఈదురుగాలులకు మండలంలో అరటి, బొప్పాయి తోటలకు నష్టం వాటిల్లుతుందని తానాం, వెన్నలపాలెం, మెట్టపాలెం తదితర గ్రామాల రైతులు ఆందోళన చెందుతున్నారు. మండలంలో రెండు రోజులుగా కురిసిన వర్షాలకు నారుమడుల్లో నీరు చేరింది. మండలంలో10.08 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైందని మండల వ్యవసాయాధికారి సీహెచ్.చంద్రావతి చెప్పారు.

ఏయూలో లింగ సమానత్వంపై జాతీయ వర్క్‌షాప్

ఎంవీపీకాలనీ: ఆంధ్ర విశ్వవిద్యాలయంలో లింగం, సమానత్వం, ప్రజాస్వామ్య రూపురేఖలు అంశంపై జాతీయ వర్క్‌షాప్ నిర్వహించారు. ఏయూ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చైర్ ఆధ్వర్యంలో శనివారం ఈ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో ఏయూ ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపల్ ఆచార్య నరసింహారావుతో పాటు న్యాయ కళాశాల ప్రిన్సిపల్ ఆచార్య సీతామాణిక్యం పాల్గొని లింగ సమానత్వం ప్రజాస్వామ్య సమాజంలో ఎంత ముఖ్యమైనదో వివరించారు. అనంతం వర్క్‌షాపు కన్వీనర్, ఏయూ డాక్టర్ బీఆర్ అంబేద్కర్ చైర్ ప్రొఫెసర్ ఆచార్య ఎం.జేమ్స్ స్టీఫెన్ రచించిన 'ఎంపవరింగ్ ఉమెన్ ఫర్ ఏ సస్టెయినబుల్ ఫ్యూచర్' పుస్తకాన్ని ఆవిష్కరించారు. లింగ సమానత్వం, స్థిరత్వం సాధన కోసం వ్యూహాలను పుస్తకం వివరిస్తుందని ఆచార్య జేమ్స్ స్టీఫెన్ వెల్లడించారు. ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ విధానంలో వర్క్‌షాపు నిర్వహించినట్లు తెలిపారు.

భవనం పైనుంచి పడి మేస్త్రి మృతి

ఆరిలోవ: జీవీఎంసీ తొమ్మిదో వార్డు విశాలాక్షినగర్‌లో జరుగుతున్న భవన నిర్మాణ పనుల్లో ప్రమాదవశాత్తు లేబర్ మేస్త్రీ రౌతు పాపారావు(45) మృతి చెందాడు. ఆరిలోవ పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాలిలా.. విశాలాక్షినగర్‌లో ఓ వ్యక్తి భవన నిర్మాణం చేపడుతున్నాడు. ఇందులో భాగంగా శనివారం లిఫ్ట్ ఏర్పాటు పనులు చేపట్టారు. లిఫ్ట్ అమర్చే క్రమంలో భవనం రెండో ఫ్లోర్‌లో ఉండగా.. దాని అడుగు భాగం తొట్టి లేబర్ మేస్త్రీ రౌతు పాపారావుపై జారిపడింది. దానితోపాటు కిందపడిన మేస్త్రీ తలకు తీవ్రగాయాలై మెడ భాగం కొంత కోసుకుపోవడంతో ప్రాణాలు కోల్పోయాడు. ఆరిలోవ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పాపారావు మృతదేహాన్ని కేజీహెచ్ మార్చురీకి తరలించారు. మృతుడి బంధువులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.



పాపారావు (ఫైల్)

బతుకుతెరువు కోసం వచ్చి..

రౌతు పాపారావుది విజయనగరం జిల్లా మెంటాడ మండలం పోరాం గ్రామం. అక్కడ నుంచి కొన్నేళ్ల కిందట బతుకుతెరువు కోసం విశాఖపట్నం వచ్చి 10వ వార్డు రవీంద్రనగర్‌లో కుటుంబంతో కలిసి నివసిస్తున్నాడు. అతడికి భార్య గౌరి, ఇద్దరు పిల్లలున్నారు. భవన నిర్మాణ పనుల్లో లేబర్ మేస్త్రీగా పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఇద్దరు పిల్లల్లో పెళ్లీడుకొచ్చిన కుమార్తె ప్రైవేట్ ఉద్యోగం చేస్తుండగా.. కుమారుడు చదువుతున్నాడు. కుటుంబాన్ని పోషించే పాపారావు మృతి చెందడంతో అతడి భార్య, కుటుంబ సభ్యులు కన్నీటి పర్యంతమవుతున్నారు.

సందేశాత్మక చిత్రం 'బ్రహ్మా సో విష్ణు'

గాజువాక: ప్రజాపిత బ్రహ్మా బాబా జీవిత చరిత్రపై రూపొందించిన బ్రహ్మా సో విష్ణు చిత్రం సందేశాత్మకమైందని మాజీ ఎమ్మెల్యే చింతలపూడి వెంకట్రామయ్య అన్నారు. సినిమా విడుదల సందర్భంగా స్థానిక లక్ష్మీకాంత్ థియేటర్‌లో జ్యోతి ప్రజ్వలన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సమాజంలో కక్షలు, వేధింపులతో ప్రాణాలను తీసుకుంటున్న మనుషులకు ఈ సినిమా కనువిప్పు కలిగిస్తుందన్నారు. మాజీ ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ మాట్లాడుతూ ప్రజల్లో పేద, ధనిక తేడా లేకుండా అందరూ సుఖంగా ఉండటం కోసం ప్రజాపిత బాబా చేసిన త్యాగాలపై సినిమా తీయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో విశాఖ జిల్లా బ్రహ్మ కుమారి సంస్థ కో–ఆర్డినేటర్ సోమేశ్వరి, అగనంపూడి అభివృద్ధి కమిటీ చైర్మన్ బలిరెడ్డి సత్యనారాయణ, ప్రజాపిత దివ్యజ్యోతి భవన్ ఇన్‌చార్జి రామకోటి, వివిధ శాఖల ప్రతినిధులు అపరంజి, మణి, లలిత, వి.సత్యశ్యామల, మమత, శ్రీను, సియ్యాది సత్యారావు, రాజు తదితరులు పాల్గొన్నారు.



జ్యోతి ప్రజ్వలనలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యేలు చింతలపూడి, ధర్మశ్రీ

ప్రభుత్వ విధానాల వల్లే ఉక్కు పరిశ్రమకు నష్టాలు



ఫ్లెక్సీ ప్రదర్శిస్తున్న ఉక్కు ఉద్యోగులు

సింహాచలం: గిరి ప్రదక్షిణలో భాగంగా అడవివరం ప్రధాన రహదరిలో విశాఖ ఉక్కు నష్టాలకు ప్రభుత్వ విధానాలే కారణమంటూ పలువురు చేసిన ప్రదర్శన ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఉద్యోగుల సంఖ్య తగ్గినా పనిభారం పెరిగినా మెరుగైన పనితీరుతో ఉత్పత్తి సామర్థ్యం పెంపొందించామని ఫ్లెక్సీలో పేర్కొన్నారు. ఈ ఫ్లెక్సీని భక్తులు ఆసక్తిగా గమనించారు.